**9.గుర్రం జాషువా**

జ). భావ కవితా రీతులలో కావ్య ప్రక్రియ చేపట్టి రచనలు చేసిన ఖండకావ్య నిర్మాత గుర్రం జాషువా. సార్వజనీనం అయిన సత్యం, ధర్మం, సమత,సౌందర్యం మొదలైన అంశాలను ప్రాతిపదికగా చేసుకుని రచించిన ఖండకావ్యాలు కుల, మత, ప్రాంతీయ భావాలకు అతీతంగా పాఠకుల హృదయాలను స్పృశించగలిగాయి.

**జాషువా జీవితం:**

1895 సెప్టెంబర్ 28న గుర్రం వీరయ్య, లింగమాంబ దంపతులకు గుంటూరు జిల్లా వినుకొండ ప్రాంతంలో జాషువా జన్మించారు. 1905లో వినుకొండలోని ఎలిమెంటరీ స్కూల్లో చేరాడు. అక్కడ తరతమ భేదాలు, కుల, వర్గ భేదాలు జాషువాను కలిచివేసాయి. జాషువా సాహిత్యంలో తాను వ్యక్తపరిచిన స్పష్టమైన అభిప్రాయాలకు బాల్యస్మృతులే ప్రాతిపదికలు అయ్యాయి.

**జాషువా సాహిత్యం:**

**అ) తొలి నాటి కృతులు:**

నెలబాలుడు, నెమలి ,నెలత, కోకిల, సూర్యోదయం, సాలీడు వంటి ఖండ కావ్యాలు రచించారు.

**ఆ) ఖండ కావ్యాలు:**

1924  నుండి 1965 వరకు జాషువా 200 ఖండ కావ్యాలను రచించారు . వీరు రచించిన ఖండకావ్యాలను 12 విభాగాలుగా విభజించవచ్చు.

**అవి:. 1.**కవిత్వతత్వ నిర్దేశకాలు 2. స్వీయ వృత్తి  సంబంధులు 3.దేశభక్త్యాత్మకాలు4. స్తుత్యాత్మకాలు 5. స్మృత్యాత్మకాలు,6 సంఘ సంస్కారాలు7. ప్రకృతి వర్ణనాత్మకాలు 8.ప్రణయ చిత్రణలు 9.పౌరాణిక పాత్రోన్మీలనాలు,10.అభినందనాత్మకాలు 11. ప్రచారాత్మకాలు 12. సంకీర్ణాలు

**జాషువా కావ్య రచనా వైశిష్ట్యం:**

**ఫిరదౌసి:** గజిని మహమ్మద్ షానామా గ్రంథాన్ని రచించమని, పద్యానికి ఒక దీనారం ఇస్తానని వాగ్దానం చేసాడు. ఫిరదౌసి 30 సంవత్సరాలు శ్రమించి 60 వేల పద్యాలను రచించి  సుల్తాన్ సమర్పించాడు. రాజు మాట తప్పి వెండి నాణాలను పంపాడు. కవి

దుఃఖిస్తూ సుల్తాన్ విమర్శిస్తూ  నిందతో కూడిన పద్యాలను రాసి పంపించాడు.దానికి ఆగ్రహించిన రాజు కవిని చంపమని ఆజ్ఞాపించాడు. సామంతరాజులు ఉపదేశంతో రాజు కవికి బంగారు నాణాలు పంపాడు . తండ్రి దుఃఖానికి కారణమైన బంగారాన్ని ఫిరదౌసి కూతురు తిరస్కరించింది.

కవి కుల మత దేశ కాలావధులు దాటిన ఒక విశిష్ట వ్యక్తి. ఫిరదౌసి జీవితం వర్ణన ద్వారా అటువంటి ఔన్నత్యాన్ని సాధించాడు.

**స్వప్న కథ -అనాథ:**1934 లో జాషువా ఈ కృతులను రచించాడు స్వప్నకథ భావ విన్యాసానికి సంబంధించినది. అనాథ అభ్యుదయ కవిత్వంలోని పీడిత ప్రజల ఆక్రందనలు తెలియజేస్తుంది.

**గబ్బిలం:** కుల భేదం వల్ల కలిగిన సైన్యాన్ని,దైన్యాన్నిచూడలేక జాషువా గుండె నుండి గబ్బిలం కావ్యం వెలువడింది. గబ్బిలం మొదటి భాగం 1941లోను, రెండో భాగం 1946 లోను వెలువడ్డాయి.

నిశిత వ్యంగ్యాన్ని, ఉక్తి వైచిత్రిని ఆశ్రయించి ,జాషువా దోపిడీ వ్యవస్థను ఆదరించే కులవ్యవస్థను విమర్శించాడు.

**ముంతాజ్ మహల్:**షాజహాన్ ముంతాజ్ ల ప్రణయ మాధుర్యాన్ని చిత్రించడంలో జాషువా భిన్నమైన ధోరణిని అనుసరించారు.

**స్మశాన వాటిక:**సాధారణంగా స్మశానం చూడాలంటేనే భయం. కానీ కవితా దృష్టితో చూసినప్పుడు మహాకవికి ఒక ధర్మం ప్రత్యక్షమైంది.

**కాందిశీకుడు:** రెండో ప్రపంచ యుద్ధ కాలంలో యుద్ధ ప్రచార శాఖలో ఉద్యోగం చేసిన కాలంలో జాషువా ఈ కావ్యాన్ని రచించాడు

**బాపూజీ:** ఇది దేశ నాయక స్మృతి కావ్యం. బాపూజీ మరణం వలన జాషువా గుండెలలో పుట్టిన శోకమే ఈ కావ్యంగా రూపుదాల్చింది. జాషువా రాల్చన అశ్రు కణాలు ఆయన అంతఃకరణశుద్ధిని తెలియజేస్తాయి.స్మృతి రచనలకు ఆధారమైన ఈ అంశమే ఈ కావ్యానికి విశిష్టతను కల్పించింది.

**నేతాజీ:**జాతికి వీరత్వాన్ని నూరిపోసిన సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర సాధనలో నిర్వహించిన పాత్రను స్తుతిస్తూ రచించిన స్తుతి కావ్యం ఇది. నేతాజీ జీవితంలోని ప్రధాన వీరరస స్ఫోరక ఘట్టాలు ఈ కావ్యంలో చిత్రించబడ్డాయి.

**స్వయంవరం:**స్వతంత్రం తరువాత భారతదేశం లో వచ్చిన అవాంఛనీయ ధోరణులు ఈ కావ్యంలో తీవ్రంగా విమర్శించబడ్డాయి. సర్వజనులకు శ్రేయోదాయకమైన గాంధీజీ సిద్ధాంతాలు కొంతకాలానికి నిరాదరణకు గురి అయ్యాయనే ఆవేదనను జాషువా దీనిలో వ్యక్తం చేసాడు.

**రాష్ట్ర పూజ:** ఆంధ్రుల చిరకాల వాంఛ అయిన ప్రత్యేక రాష్ట్రం అవతరించిన సందర్భంలో ఈ కావ్యం రచించారు. దీనిలో పొట్టి శ్రీరాములు ఆత్మార్పణం, ఆంధ్ర దేశ సౌభాగ్యం వర్ణించబడ్డాయి.

**ముసాఫరులు:** ఈ లోకంలో పుట్టి గిడుతున్న అసంఖ్యాక ప్రాణికోటికి గమ్యం ఏంటి? యుగాలనుండి కలవరపెడుతున్న సమస్యల గురించి జాషువా తెలియజేశారు.

**కొత్తలోకం:** శాంతి జీవనానికి ఆటంకంగా తయారైన మనిషిని గురించి కవి వితర్కించాడు.

**క్రీస్తు చరిత్ర:** జాషువా 1963లో క్రీస్తుచరిత్రను రచించాడు. మత గ్రంథాలను ,అందులోనూ బైబిల్ ను ఛందోబద్ధం చేయడం కత్తిమీద సాము వంటిది. 1964లో తెలుగులో వెలువడిన ఉత్తమ కావ్యం గా క్రీస్తు చరిత్ర కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని పొందింది.

నాగార్జునసాగర్ అనే ఖండకావ్యాన్ని, కుశలవోపాఖ్యానం, చిన్నానాయకుడు, అనేక వచన కావ్యాలను, రుక్మిణీ కల్యాణం చిదానంద ప్రభాతం, ధ్రువ విజయం, తెరచాటు, మీరాబాయి అనే నాటకాలను కూడా రచించారు.

**బిరుదులు పురస్కారాలు:** జాషువా రచించిన క్రీస్తు చరిత్ర కావ్యానికి 1964లో కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది.1936లో కవికోకిల ,1947లో నవయుగ కవి చక్రవర్తి అనే బిరుదులు వరించాయి.చేళ్ళపిల్లర్ల వెంకట శాస్త్రి గారు జాషువాకి గండపెండేరం అలంకరింపజేశారు 1952లో మధుర

శ్రీనాథ బిరుదు ప్రదానం చేయబడింది.1953లో  కనకాభిషేకం జరిగింది. 1970 రిపబ్లిక్ దినోత్సవం రోజు భారత ప్రభుత్వం పద్మభూషణ్ బిరుదుతో సత్కరించింది. అదే సంవత్సరం కళాప్రపూర్ణ బిరుదు కూడా లభించింది.

గుర్రం జాషువా నవ్యాంధ్ర కవిత్వాన్ని ప్రభావితం చేసిన భావ కవిత్వం ,అభ్యుదయ కవిత్వం వంటి ఉద్యమాలకు ప్రత్యక్షసాక్షి. ఆధునికాంధ్ర కవిత్వంలో ఖండకావ్యం వ్రాసి అఖండ స్ఫూర్తిని అందించిన కీర్తి జాషువాకే దక్కింది అని ఆచార్య సి.నారాయణరెడ్డి గారి ప్రశంస అక్షర సత్యం.